క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన వైద్యాధికారి



రవితేజ

కరకగూడెం: మండల ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం నూతన వైద్యాధికారిగా పి. రవితేజ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం పీహెచ్ సీలో రెండు సంవత్సరాలు కాంట్రాక్ట్ వైద్యుడిగా సేవలందించిన ఆయన తాజాగా ప్రభుత్వం చేపట్టిన నియామకాల్లో కరకగూడెంకు వచ్చారు. ప్రజలకు ఆరోగ్యంపై అనునిత్యం అవగాహన కల్పిస్తూ మెరుగైన వైద్య సేవలు అందిస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. కాగా ఇదివరకు వైద్యాధికారిగా బాధ్యతలు నిర్వర్తించిన కారం మధు బదిలీ ఉత్తర్వులు వచ్చేవరకు ఇక్కడే సేవలు అందించనున్నారు.

బీఆర్ఎస్ బలోపేతానికి శ్రమించాలి

మణుగూరురూరల్: గ్రామస్థాయిలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త సైనికుల్లా శ్రమించాలని ఆ పార్టీ మండల కన్వీనర్ కుర్రి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని రామానుజవరం గ్రామ పంచాయతీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకు శక్తివంచన లేకుండా పని చేయాలని సూచించారు. సమావేశంలో మణుగూరు మాజీ జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్ కుంటా లక్ష్మణ్, మండల కో కన్వీనర్ బొలిశెట్టి నవీన్, నాయకులు ముత్యంబాబు, ఎడ్ల శ్రీనివాస్, ప్రభుదాస్, మాజీ డీసీసీబీ డైరెక్టర్ బోయిల్ల రమణయ్య పాల్గొన్నారు.

గ్రామ కమిటీ ఎన్నిక..

అనంతరం బీఆర్ఎస్ గ్రామపంచాయతీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా లేళ్ల రామకృష్ణ, కార్యదర్శిగా బోయిల్ల రాజు, ఉపాధ్యక్షుడిగా చెట్టి ప్రసాద్, సహాయ కార్యదర్శిగా డేగల ప్రశాంత్, కోశాధికారిగా గడ్డం భాస్కర్‌తోపాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఉత్సాహంగా సెమీ క్రిస్మస్



సెమీ క్రిస్మస్ వేడుకల్లో సందడి చేస్తున్న చిన్నారులు

చర్ల: మండలంలోని కుదునూరులో గల సెయింట్ మేరీస్ చర్చ్‌లో సోమవారం రాత్రి సండేస్కూల్ సెమీ క్రిస్మస్ వేడుకలు ఉత్సాహంగా సాగాయి. వేడుకల్లో భాగంగా చిన్నారులు క్రిస్మస్ గీతాలను ఆలపిస్తూ, నృత్యాలు చేశారు. క్రీస్తు జనన విధానాన్ని నాటిక ద్వారా ప్రదర్శించి ఆకట్టుకున్నారు. బైబిల్ కంఠస్థ వాక్యాలను చదువుతూ పెద్దలచే ఆహా అనిపించుకన్నారు. సండే స్కూల్ చిన్నారులు క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా సండేస్కూల్ చిన్నారులు చర్చ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పశువుల పాక, పాకలో బాల యేసుని ప్రతిమ, అందులో ఏర్పాటు చేసిన బైబిల్ వాక్యాలు ఆ ప్రాంతం మీదుగా వచ్చి పోయే వారిని ఆకట్టుకున్నాయి. పాస్టేట్ ఇన్‌చార్జ్ డీకన్ ఎం.ప్రవీణ్, స్వాతి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉచితంగా మందులు పంపిణీ

మణుగూరురూరల్: మండలంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, మారుతీ నర్సింగ్ కళాశాల-భద్రాచలం, పుష్పగిరి కంటి ఆస్పత్రి-సికింద్రాబాద్, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వారి సంయుక్త ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్లు చేయించుకున్న వారికి సోమవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ మందులను పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన వైద్యశిబిరంలో నేత్ర వైద్యాధికారి సంజీవరావు పలువురికి కంటి వైద్యపరీక్షలు చేయగా.. వీరిలో 45మంది కంటి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించారు. వీరిని ఈ నెల 10,12,17,19 తేదీల్లో పుష్పగిరి కంటి ఆస్పత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించనున్నట్లు తెలిపారు. ఆర్ఎంఓ డాక్టర్ గౌరి ప్రసాద్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించాలి

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం సమీపంలోని ఎర్రగుంటపల్లి వద్ద ఆదివాసీలు, ఇతర పేదలు నిర్మించుకున్న గుడిసెలను అటవీ శాఖ అధికారులు తొలగించడం తగదని, ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జాతీయ నాయకుడు కెచ్చెల రంగారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఎర్రగుంటపల్లి వద్ద దీక్ష చేస్తున్న బాధితుల వద్దకు వెళ్లి మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ పాల్వంచ డివిజన్ నాయకులు గోగినపల్లి ప్రభాకర్, భాస్కర్, వాసం బుచ్చిరాజు, కుంజా అర్జున్, కంగాల భూలక్ష్మి, కంగాల వెంకటేష్ పాల్గొన్నారు.

రోడ్లపై ఆకతాయిల ఆగడాలు

- ర్యాష్ డ్రైవింగ్‌తో పేట్రేగిపోతున్న యువత
- వింత శబ్దాలతో సైలెన్సర్లు
- ట్రాఫిక్ నిబంధనలకు తూట్లు



చర్యలు తీసుకుంటాం



రోడ్లపై ఆకతాయిలు చేస్తున్న ర్యాష్ డ్రైవింగ్, మితిమీరిన వేగం, రణగొన శబ్దాలు వంటి అంశాలు మా దృష్టికి వచ్చాయి. ముందు ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా.. ట్రాఫిక్ నియమ నిబంధలను అతిక్రమిస్తూ డ్రైవింగ్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటాము. తల్లిదండ్రులు పిల్లలకు నచ్చిన బైకులను కొని ఇవ్వడమే కాదు.. వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండేలా, హెల్మెట్ ధరించేలా, వాహనపత్రాలు కలిగి ఉండేలా చూసుకోవాలి. రోడ్లపై ఎవరైనా ఇష్టం వచ్చినట్లు బైకులను నడిపితే జరిమానాలు విధించడంతో పాటు వాహనాలను సీజ్ చేస్తాం.

– సీఐ సతీష్‌కుమార్

మణుగూరురూరల్: పట్టణంలోని కొంతమంది యువత ఆకతాయిలు రోడ్లపై చేస్తున్న ఆగడాలకు అంతుపంతు లేకుండా పోతోంది. ద్విచక్రవాహనం చేతిలో ఉంటే చాలు ఇష్టం వచ్చినట్లు నడుపుతూ.. తోటి వాహనదారులను, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అంతటితో ఆగకుండా వాహన సైలెన్సర్లు తీసేసి కొందరు రయ్ రయ్ మంటూ.. ఫట్ ఫట్.. ఢాంఢాం.. అంటూ రణగొన శబ్దాలు చేస్తున్నారు. పట్టణ ప్రజల చెవులకు చిల్లులు పడేలా ప్రవర్తిస్తున్నారు. ఇంకొందరు ఒకే బైక్‌పై ముగ్గురు, నలుగురు కూర్చొని వివిధ రకాల హారన్లతో, పిచ్చి పిచ్చి అరుపులు, కేకలతో పడుపుతున్నారు. మితిమీరిన వేగంతో ప్రమాదాకర స్టంట్లతో వాహనదారులను హడలెత్తిస్తున్నారు. ఇంకొందరు పోలీసులు గుర్తించకుండా నంబర్ ప్లేట్లు లేకుండా సైతం వాహనాలను నడుపుతున్నారు.

ఇక రాత్రి వేళల్లో అయితే కొంతమంది ఆకతాయిలు మద్యం, మత్తు పదార్థుల మత్తులో రోడ్లపై సంచరిస్తూ అడ్డం వచ్చిన వారిని ఇష్టం వచ్చినట్లు దూషిస్తున్నారు. అనవసర గొడవలకు దిగుతూ ప్రజలను, వ్యాపారస్తులను ఇబ్బందులకు గురి చేస్తున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. రోజు రోజుకూ యువత ట్రాఫిక్ నియమ నిబంధనలకు తూట్లు పొడుస్తూ ర్యాష్ డ్రైవింగ్‌లో పేట్రేగిపోతున్నారు. రోడ్లపై ఆకతాయి డ్రైవింగ్ చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుండం పట్ల పట్టణ వాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు దృష్టి సారించి ఆకతాయిల ర్యాష్ డ్రైవింగ్, మితిమీరిన వేగానికి అడ్డుకట్ట వేయాల్సిలని కోరుతున్నారు.

కనిపించని బంద్ ప్రభావం



బండిరేవు గ్రామశివారులో తనిఖీలు..

దుమ్ముగూడెం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చల్పాక బూటకపు ఎన్‌కౌంటర్‌ను నిరసిస్తూ మావోయిస్టు రాష్ట్ర కమిటీ ఇచ్చిన బంద్ చాయలు మండలంలో కనిపించలేదు. సోమవారం యథావిధిగా ఆర్టీసీ, ప్రైవేటు, వాహనాలు, విద్యా, వ్యాపార సంస్థలు పని చేయగా ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు తెరిచి పూర్తి స్థాయి కార్యకలాపాలు నిర్వహించాయి. రాష్ట్ర బంద్ సందర్భంగా మండల కేంద్రంతో పాటు సరిహద్దు గ్రామాల్లో కూడా ప్రజలు రోడ్లపై స్వేచ్ఛగా తిరుగగా దుకాణాలు సైతం తెరిచి వ్యాపార లావాదేవీలు కొనసాగాయి. బంద్ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమై మండలంలోని మావోయిస్టు ప్రభావిత గ్రామాలలో గాలింపు చర్యలు చేపట్టి మైదాన ప్రాంతాల్లో ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించి అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని వివరాలను సేకరించి వదిలివేస్తున్నారు. సివిల్, సీఆర్పీఎఫ్, స్పెషల్ పార్టీ బృందాలు గొత్తికోయ, ఆదివాసీ గూడాలు, అడవుల్లో కూంబింగ్ ముమ్మరం చేశారు.

విద్యార్థులకు ప్రతిభా పోటీలు

బూర్గంపాడు: తెలంగాణ బయలాజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో బూర్గంపాడు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ప్రతిభా పోటీలను నిర్వహించారు. ఇన్‌చార్జ్ హెచ్ఎమ్ రవీంద్ర ప్రశ్నాపత్రాలను ఆవిష్కరించి విద్యార్థులకు అందజేశారు. జీవశాస్త్ర ఉపాధ్యాయులు లక్ష్మణ్ ప్రతిభా పోటీలకు మండల ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు ఈ ప్రతిభా పోటీలలో పాల్గొన్నారు. తెలుగు మీడియంలో ఎస్.వాణి, షీలా రోషిణి ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచారు. ఇంగ్లిష్ మీడియంలో కె.వల్లీశ్రీ, అలివేలు ప్రథమ స్థానంలో అఫ్రా ఫాతిమా ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరికి నిర్వహకులు బహుమతులను అందజేశారు. వీరు ఈ నెల 18న కొత్తగూడెంలో జరిగే జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు నిర్వహకులు తెలిపారు.



బూర్గంపాడు: ప్రతిభా పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

పాఠశాలల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు మండల స్థాయి బయాలజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను సోమవారం నిర్వహించారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో ఇంగ్లీష్ మీడియంలో నర్సాపురం పాఠశాలకు చెందిన నిశాల్ ప్రథమస్థానం, పర్ణశాల పాఠశాలకు చెందిన సుస్మాలత ద్వితీయ స్థానం, తెలుగు మీడియంలో దుమ్ముగూడెం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన వెంకటరమణ ప్రథమస్థానం, నర్సాపురం పాఠశాలకు చెందిన అక్షయప్రియ ద్వితీయ స్థానం సాధించినట్లు, వీరిని జిల్లా స్థాయికి పంపనున్నట్లు ఎంఈఓ సున్నం సమ్మయ్య తెలిపారు. విజేతలకు మెమోంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పర్ణశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం, మండల కోఆర్డినేటర్ ఏజే.ప్రభాకర్, వివిధ

దమ్మపేట: తెలంగాణ రాష్ట్ర ఫోరం ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించనున్న జీవశాస్త్రం ప్రతిభా పాటవ పోటీ పరీక్షలకు మండలానికి చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. సోమవారం దమ్మపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో ఈ పరీక్షలను నిర్వహించగా.. ఇంగ్లీషు మీడియం విభాగంలో దమ్మపేట జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఎస్‌కె.నాసియా, మల్కారం జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఏ.మనోహర్‌సాయి, డి.గొల్లగూడెం ఆశ్రమ పాఠశాలకు చెందిన బి.అలేఖ్యలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. తెలుగు మీడియం విభాగంలో నాగుపల్లి జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన కె.ఉదయశ్రీ, పట్వారిగూడెం జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఎం.హేమశ్రీ, ముష్టిబండ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన జే.ప్రణతిలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. మండల స్థాయిలో గెలుపొందిన వీరు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వీరిని ఎంఈఓ కీసర లక్ష్మి, దమ్మపేట హెచ్ఎం టి.ఉషారాణి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇళ్ల వివరాల నమోదు ప్రారంభం

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించిన యాప్ ద్వారా సర్వేను సోమవారం మండలంలో ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి వివరాలు నమోదు చేశారు. దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి యజమాని పేరు, కుటుంబసభ్యుల వివరాలు, ప్రస్తుతం నివసిస్తున్న ఇంటి స్వరూపం, ఇంటి నిర్మాణానికి స్థలం ఉందా, లేదా తదితర వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. కార్యక్రమాన్ని ఎంపీడీఓ మహాలక్ష్మి పర్యవేక్షించారు.

ఘనంగా సోనియా జన్మదిన వేడుకలు

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలు, పార్టీ కార్యాలయాల్లో నాయకులు, కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేశారు. ఒకరికొకరు పంచిపెట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణా రాష్ట్రాన్ని ఇచ్చి ఇక్కడి ప్రజల చిరకాల వాంఛ తీర్చిన సోనియా గాంధీ.. తెలంగాణా తల్లిగా ప్రజల హృదయాల్లో నిలిచిపోయారన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



భద్రాచలంటౌన్: సోనియా గాంధీ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న పొదెం వీరయ్య



మణుగూరుటౌన్: కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకుంటున్న నాయకులు



అశ్వారావుపేటరూరల్: కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బైండోవర్ కేసులు నమోదు

ములకలపల్లి: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చలో హైదరాబాద్ కార్యక్రమానికి బయలుదేరిన మాజీ సర్పంచ్‌లు, ఆశా కార్యకర్తలపై పోలీసులు వేర్వేరుగా బైండోవర్ కేసులు నమోదు చేశారు. మాజీ సర్పంచ్‌లు బైటి రాజేశ్, వాడె నాగరాజు, గడ్డం భవాని అదేవిధంగా ఆశా వర్కర్లు దుబ్బా ధనలక్ష్మీతోపాటు మరో ముగ్గురు ఆశా కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.

రుణమాఫీ కాలేదు.. న్యాయం చేయండి

అశ్వాపురం: తమకు లక్ష రూపాయలు రుణమాఫీ కాలేదని, తమ కుటుంబానికి న్యాయం చేయాలని మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన రైతు బద్దం శంభిరెడ్డి సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణిలో కలెక్టర్‌కు విన్నవించారు. సాక్షితో తన సమస్య వివరిస్తూ.. సమస్యపై వ్యవసాయ శాఖ అధికారులను పలుమార్లు కలిసి విన్నవించినప్పటికీ మూడు నెలలుగా సమస్య అలాగే ఉందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడిగా హరికృష్ణ



దుమ్ముగూడెం: కాంగ్రెస్ పార్టీ మండల వైస్ ప్రెసిడెంట్‌గా తెల్లం హరికృష్ణ, కార్యదర్శిగా చిదరగడ్డ వెంకటేశ్వర్లును నియమిస్తూ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ కార్పొరేషన్ చైర్మన్ మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య నియామక పత్రాలను సోమవారం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి అనుక్షణం పని చేస్తున్న యూత్ నాయకుడు తెల్లం హరికృష్ణ పనితనాన్ని గుర్తించిన కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడిగా నియమించింది. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వీరమాచినేని వినిల్, నాయకులు కనుబుద్ది దేవా, గజేంద్ర, శివ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహాల వితరణ

దమ్మపేట: మండల కేంద్రం దమ్మపేటలో కొలువైయున్న సుబ్రహ్మణ్య స్వామి ఆలయానికి రూ.45,000ల విలువైన ఉత్సవ విగ్రహాలను అదే గ్రామానికి చెందిన తాళ్ల పుల్లయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు వితరణగా అందజేశారు. ఆలయంలో షష్ఠి ఉత్సవాల ముగింపు సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాలతో గ్రామంలోని పురవీధుల్లో శోభాయాత్రను నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, కాంగ్రెస్ నాయకులు చిన్నశెట్టి యుగంధర్, వాసం శ్రీను, పగడాల రాంబాబు, గోపిశాస్త్రి పాల్గొన్నారు.

కుల ధ్రువపత్రాలు ఇవ్వాలని ఆందోళన

చర్ల: వలస ఆదివాసీలకు ఎస్టీ కుల ధ్రువపత్రాలివ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం చర్లలో ఆదివాసీలు ఆందోళన నిర్వహించారు. చర్లలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించిన ఆదివాసీలు ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మండలంలోని వివిధ ఆదివాసీ గ్రామాల నుంచి సుమారు 200 మంది ఆదివాసీలు తరలి వచ్చారు. తక్షణమే నిలిపివేసిన కుల ధ్రువపత్రాలను ఇవ్వాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఆదివాసీల ఆందోళనకు తెలంగాణా గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కారం పుల్లయ్య, నాయకులు కారం నరేషం మద్దతు తెలిపారు. ఈ ఆందోళనలో మండలంలోని వివిధ ఆదివాసీ గ్రామాలకు చెందిన ఆదివాసీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు నిరంతర కృషి

మణుగూరుటౌన్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను చేరుకునేలా ఉద్యోగులు, కార్మికుల సహకారంతో సమష్టిగా ముందుకు సాగుతున్నామని మణుగూరు ఏరియా ఇన్‌చార్జ్ జీఎం లక్ష్మీపతిగౌడ్ తెలిపారు. జీఎం కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది 127.60 లక్షల టన్నుల లక్ష్యాన్ని నిర్దేశించగా నవంబర్ నాటికి 81.40 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి నమోదైందని, ఓబీ 109.50 క్యూబిక్ మీటర్లకుగాను 85.09 సాధించామని తెలిపారు. వర్షాల కారణంగా వెనుకబడినా ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి లక్ష్యసాధనకు కృషి చేస్తున్నామన్నారు. అలాగే, కార్మికుల గైర్హాజరును తగ్గించేందుకు పలుమార్లు కౌన్సెలింగ్ నిర్వహించి వారు ఉద్యోగానికి వచ్చేలా పాటుపడుతున్నామని తెలిపారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ జీఎం లక్ష్మీపతిగౌడ్

అంతేకాక మణుగూరు ఓసీ విస్తరణకు తీసుకుంటున్న చర్యలు, పరిసర గ్రామాల్లో హెల్త్‌క్యాంప్‌ల నిర్వహణ, యంత్రాల వినియోగాన్ని పెంచడంపై వివరించారు.

ఎస్సీ హాస్టల్‌లో తనిఖీ



విద్యార్థులకు స్వెట్టర్లు అందజేస్తున్న తహసీల్దార్ అశోక్ కుమార్

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలోని ఎస్సీ హాస్టల్ వసతి గృహాన్ని తహసీల్దార్ అశోక్‌కుమార్ సోమవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ పరిసర ప్రాంతాలు పరిశీలించారు. హాస్టల్ లో ఉన్న పిల్లలకు అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే వసతి గృహంలో ఫర్నీచర్, వాటర్ ఫెసిలిటీ, ఫ్లోర్ వర్క్, వాల్ పెయింట్, ఫుడ్ ఫెసిలిటీ, స్టేషనరీ అందుతున్న వివరాలు పిల్లల ద్వారా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు స్వెట్టర్లు అందించారు. పిల్లలకు ఏటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని హాస్టల్ వార్డెన్ మల్లికార్జున్‌ను ఆదేశించారు. అలాగే రూ.20వేలతో హాస్టల్‌లో నెలకొన్న చిన్నచిన్న మరమ్మతు పనులను తహసీల్దార్ దగ్గరుండి చేయించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ మల్లికార్జున్, వాచ్మెన్, కుక్, గ్రామస్తులు హుస్సేన్ అహ్మద్, ఎంఆర్ఓ ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌ల ప్రదానం



కరాటేలో ప్రతిభ చూపిన చిన్నారులకు బెల్ట్‌లు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

బూర్గంపాడు: కిరణ్ పునాకోషి షోటోకాన్ కరాటే అకాడమి తెలంగాణ ఆధ్వర్యంలో సోమవారం సారపాకలో చిన్నారులకు కరాటే ప్రతిభా పోటీలను నిర్వహించి బెల్ట్ గ్రేడింగ్స్‌ను ప్రదానం చేశారు. భద్రాచలం, బూర్గంపాడు పరిసర ప్రాంతాలకు చెందిన 40మంది చిన్నారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. చిన్నారులు కిరణ్, నవీన, రుత్విక, తేజశ్రీ,పల్లవిలు ఎల్లో బెల్ట్‌లు సాధించారు. చిన్నారులు సిద్దార్థ, ఛావెజ్, మనస్విని,చక్రి, సత్య, దినేష్, అభినవ్, మౌషిక్, రితీక్, సతీష్,జితేంద్ర, ప్రనవల్, సమీర్ తదితరులు గ్రీన్ బెల్ట్ సాధించారు. బూర్గంపాడు ఎస్ఐ నాగబిక్షం చిన్నారులకు బహుమతులను అందజేశారు.కిరణ్ పునాకోషి షోటోకాన్ కరాటే అకాడమి చెందిన మాస్టర్స్ చంద్రశేఖర్, సురేష్, యాకుబ్, రవి, జిల్లా కరాటే అసోసియేషన్ బాధ్యులు రవి తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

అశ్వారావుపేటరూరల్: సీఎం కప్-2024 మండల స్థాయి క్రీడా పోటీలను ఈ నెల 11వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ తెలిపారు. సోమవారం కార్యాలయంలో క్రీడా పోటీలపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక వ్యవసాయ కళాశాల క్రీడా ఆవరణలో మండల స్థాయి క్రీడా పోటీల్లో భాగంగా క్రీడాకారులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, యోగ, ఫుట్‌బాల్ పోటీలను రెండు రోజులపాటు జరుగుతాయన్నారు. మండల స్థాయి పోటీల్లో క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

ఉపాధ్యాయులకు సన్మానం

మణుగూరురూరల్: మండలంలోని గుట్టమల్లారంలో గల శ్రీచైతన్య పాఠశాలలో 2023-24 విద్యాసంవత్సరంలో విద్యార్థులు 10/10 జీపీఏ సాధించేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను పాఠశాల ఏజీఎం జయప్రకాష్ సోమవారం పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఘనంగా సన్మానించి బహుమతులతో సత్కరించింది. కార్యక్రమంలో పాఠశాల కోఆర్డినేటర్ వెంకట్, ప్రిన్సిపల్ యుగంధర్, అకాడమిక్ డీన్ భాస్కర్‌రెడ్డి, సీ బ్యాచ్ ఇన్‌చార్జ్ కొమరయ్య, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుల సంతాపం

చర్ల: సీపీఎం చర్ల మండల కమిటీ సభ్యుడు బందెల చంటి కుమారుడు బందెల లవణ్‌చంద్ర మృతి పట్ల పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం వారు చర్లలో లవణ్‌చంద్ర భౌతిక ఖాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో జిల్లా సీనియర్ నాయకులు ఎలమంచి రవికుమార్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొలగాని బ్రహ్మాచారి, కారం పుల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు రేపాకుల శ్రీనివాస్, గడ్డం స్వామి, చంద్రయ్య, మండల కార్యదర్శి మచ్చా రామారావు, నాయకులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

చంద్రుగొండ: కస్తూర్బాగాంధీ విద్యాలయంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీపార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేశారు. ఉపాధ్యాయురాళ్ళు, సిబ్బందితో కలిసి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎన్డీ జిల్లా నాయకుడు ఎస్కే ఉమర్ మాట్లాడుతూ కస్తూర్బాలో ప్రభుత్వం శ్రమదోపిడీ చేస్తోందని విమర్శించారు. కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో ఇఫ్టూ నాయకులు వరికూటి వెంకట్రావ్, అరుణలతోపాటు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

'నవోదయ'పై రసాభాస



ఆర్ఐకు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

అశ్వాపురం: నవోదయ పాఠశాలను అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులో భూసేకరణ చేసిన స్థలంలోనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ ఆధ్వర్యంలో సోమవారం పార్టీ శ్రేణులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. నాడు రేగా కాంతారావు చొరవతో బీజీ కొత్తూరులో 30 ఎకరాలు నవోదయకు కేటాయించి టెండర్లు పిలిస్తే.. నేడు దానిని వేరే ప్రాంతాలకు తరలిస్తే ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి, యూత్ మండల అధ్యక్షుడు గద్దల రామృష్ణ, మాజీ వైస్ ఎంపీపీ కంచుగట్ల వీరభద్రం, సూదిరెడ్డి గోపాలకృష్ణారెడ్డి, మేడవరపు సుధీర్, చిలకా వెంకటరామయ్య, పాపారావు, గుంపెన శ్రీను, చుంచు రామ్మూర్తి, బొర్రా శ్రీను, పిట్టా శ్రీను, ఇసంపల్లి పున్నరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టెండర్లు పిలిచాక తరలించడం ఏమిటి?

నవోదయ పాఠశాలను మండల పరిధిలోని బీజీ కొత్తూరు ప్రాంతంలోనే ఏర్పాటు చేయాలని సీపీఎం మండల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మల్లెలమడుగు గ్రామంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టెండర్లు కూడా పూర్తయ్యాక స్కూల్‌ను వేరే ప్రాంతానికి తరలించడాన్ని ఖండించారు. పార్టీ మండల నాయకులు దండి రాములు, స్వర్గం రాఘవులు, బొమ్మరాతి రామయ్య, బొడ్డు రాములు, పినికేసి సుధాకర్‌రెడ్డి, తూము వెంకన్న, పగడాల అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ది 'హై డ్రామా': కాంగ్రెస్

నవోదయ పాఠశాల తరలింపు పేరుతో బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న హైడ్రామాలు మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం పార్టీ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నవోదయ ఏర్పాటు స్థలం కేంద్రం చేతిలో ఉంటుందని, బీఆర్ఎస్ నాయకులు తమ ఉనికి కోసం విమర్శలు చేస్తున్నారని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, సదర్‌లాల్, బట్టా సత్యనారాయణ, కొండబత్తుల ఉపేందర్, తెల్లం వీరభద్రం, గుర్రం చెన్నయ్య, వీరభద్రారెడ్డి, నరసింహారావు, గొల్లపల్లి నరేష్, సతీష్, షారూక్‌పాషా, సామకూరి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.